క్లుప్తంగా

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లిమర్ల రూరల్: సమాజ హితం ఆకాంక్షిస్తూ మండలంలోని దన్నానపేట జంక్షన్ సమీపంలోని ఇమ్మానుయేల్ చర్చిలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వమానవాళి బాగు కోసం ప్రతిఒక్కరూ ఏసుప్రభువుని ప్రార్థించాలని మతపెద్దలు అన్నారు. భగవంతుని నామస్మరణతోనే మానవునికి మనశ్శాంతి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు మాతా కుమార్, ఎలీషా సత్యనారాయణ, చంటి పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



మురుగునీటి కాలువలో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రధాన రోడ్లు, వీధుల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించారు. అనంతరం వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేసి, పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, వార్డు కన్వీనర్లు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంగమ్మతల్లి పండగ



మంగమ్మతల్లిని దర్శించుకుంటున్న శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: పట్టణంలో చీపురుపల్లి రోడ్డులోని మంగమ్మతల్లి పేరంటాల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. పేరంటాలకు పసుపు, కుంకుమ పూజలు చేసి, ముర్రాటలు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, వై.వాసు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి సంతోషిమాత ఆలయ మహోత్సవం

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సంతోషిమాత ఆలయ 37వ యాత్రా మహోత్సవాలు ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. అమ్మవారికి బుధ, గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటాయి. ఈ మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పొగమంచుతో ఇబ్బందులు



పొగమంచు కారణంగా లైట్లు వేసి మరీ ప్రయాణిస్తున్న వాహనచోదకులు

రేగిడి: పొగమంచుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా ఉదయం 8 గంటల వరకూ పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడని పరిస్థితి. వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఆపద్బాంధవుడు ముత్యాలరావు



ముత్యాలరావును సన్మానిస్తున్న సేవాసంఘం ప్రతినిధులు

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడు ఉగిరి ముత్యాలరావు ఆపద్బాంధవుడు అని సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ అన్నారు. మగ్గూరు గ్రామంలో మాతృశ్రీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముత్యాలరావు సన్మాన సభ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ఎంతోమందికి తక్షణ వైద్య సేవలందించి, ఎంతోమంది ప్రాణాలు కాపాడారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాంసం.. మోసం!

- మాంసం విక్రయాల్లో నిబంధనలకు తిలోదకాలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న విక్రేతలు
- జోరుగా నాసిరకం, కుళ్లిన మాంసం విక్రయాలు
- దుకాణాల్లో పరిశుభ్రత సైతం పాటించని వైనం
- అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నిబంధనలివే..

- అనుమతులున్న దుకాణాల్లోనే మాంసం విక్రయాలు చేపట్టాలి
- కార్పొరేషన్‌కు చెందిన పశువైద్యాధికారి ధ్రువీకరించిన తర్వాతనే స్లాటర్ హౌస్‌లో జంతువధ చేయాలి.
- మున్సిపల్ శాఖ ముద్ర వేసిన తర్వాత మాంసం విక్రయించాలి.
- జంతువు ఆరోగ్యంగా ఉందా, బతికి ఉండగానే దానిని వధించారా అనేది వెటర్నరీ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది.

కొనేటప్పుడు ఇవి గమనించాలి..

- లేత తెలుపు రంగు మాంసం ఆరోగ్యకరమైనది.
- గట్టిదనం ఉంటేనే తాజాదనం ఉన్నట్లు
- మాంసం కబేళా నుంచి తెచ్చిందా.. లేదా అనేది అడగాలి.
- కార్పొరేషన్ అధికారులు వేసిన ముద్రను పరిశీలించాలి.
- ఎరుపు రంగు, మడతలు ఉన్న మాంసం కొనకపోవడం మంచిది.
- కొన్ని సందర్భాల్లో చూడటానికి తాజాగా ఉన్నా.. వండే సమయంలో చెడు వాసన వస్తే అలాంటి మాంసం తినకూడదు.
- అనుమానం వస్తే కార్పొరేషన్, వెటర్నరీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

విజయనగరం:

నాన్‌వెజ్ ప్రియులను మాంసం విక్రేతలు నిలువునా మోసం చేస్తున్నారు. నాసిరకం, కుళ్లిన, అనారోగ్య జంతువుల మాంసాన్ని ఇష్టారాజ్యంగా అమ్మేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఫ్రిజ్‌లలో మిగులున్న చికెన్, మటన్ నిల్వలను మరుసటిరోజు కొనుగోలుదారులకు అంటగట్టి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు చికెన్, మటన్ వేస్ట్‌ను హోటళ్లకు తరలిస్తూ భోజన ప్రియుల ఆరోగ్యం దెబ్బతీస్తున్నారు. పండగ నేపథ్యంలో ఇది కాస్త ఎక్కువ కావడం, జిల్లా కేంద్రంలో మాంసం విక్రయాలపై నిఘా కరువు అవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల సమన్వయ లోపం..

కార్పొరేషన్ ప్రజారోగ్య, వెటర్నరీ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే నాసిరకం మాంసం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో చికెన్ సెంటర్ 130, మటన్ విక్రయశాలలు 64 వరకు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం కిలో మటన్ ధర రూ.800కు విక్రయిస్తుండగా, కిలో చికెన్ రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. అయితే ఇటు అధికారికంగా, అటు అనధికారికంగా నిర్వహిస్తున్న మాంసం దుకాణాల్లో నిబంధనలు పాటించడం లేదు. అపరిశుభ్ర వాతావరణం నడుమ ఎక్కడ పడితే అక్కడ మాంసం విక్రయించేస్తున్నారు. చేపల విక్రయాల పరిస్థితి ఇదే మాదిరి ఉంది. మురుగు కాలువలకు ఆనుకుని, రోడ్ల మీదనే విక్రయాలు చేస్తున్నారు. దీంతో పరిసరాలు కూడా అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఆది, మంగళవారాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

పుట్టగొడుగుల్లా చికెన్ సెంటర్లు..

విజయనగరం జిల్లా కేంద్రంలో చికెన్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారిక లెక్కల ప్రకారం అనుమతులు ఉన్న దుకాణాలు 130కు పైగా ఉండగా, అనుమతులు లేకుండా అంతకన్నా రెట్టింపు దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతుండడం గమనార్హం. ప్రధానంగా కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గూడ్స్‌షెడ్ రోడ్డు కోట జంక్షన్, దాసన్నపేట జంక్షన్, రింగ్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, కలెక్టరేట్ జంక్షన్‌లలో అధికారిక దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు వీధికొకటి చొప్పున వెలుస్తున్న చికెన్, మటన్ సెంటర్లు కొన్ని వందల్లో ఉన్నాయి. రోడ్డు పక్కన చిన్నపాటి బల్ల ఉంచి, ఉదయం, సాయంత్రం మాంసం విక్రయాలు చేపడుతున్నారు. మిగులు వ్యర్థాలను సమీప కాలువల్లో వేయడంతో పరిసరాలు దుర్గంధ భరితమవుతున్నాయి. అంతేకాకుండా ఆ ప్రాంతాలు దోమలు, ఈగలు, పందులు, కుక్కలకు నెలవుగా మారుతున్నాయి.



విజయనగరంలోని చికెన్ విక్రయ దుకాణం



అమ్మకానికి సిద్ధం చేసిన మటన్

నిబంధనలు పాటించకుంటే చర్యలు..

నిబంధనలు పాటించకుండా మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలో ఎక్కువ సంఖ్యలో మాంసం విక్రయశాలలు ఉండడం నిజమే. వినియోగదారులు కూడా మాంసం కొనుగోలు చేసేటప్పుడు సరిగ్గా చూసుకోవాలి. కార్పొరేషన్ ముద్ర వేసి ఉన్న మాంసం ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయడం మేలు.

– రెడ్డి శ్రీరాములునాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర



లక్కవరపుకోట: కొండపై సీతారామలక్ష్మణుల దర్శనానికి వెళ్తున్న భక్తులు

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులతో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు తదితరులు ఉన్నారు.

గృహలింగేశ్వరస్వామి తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామ సమీపంలోని కొండవద్ద ఉన్న గృహలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి కొండదిగువన ఉన్న గృహలింగేశ్వరస్వామిని, అలాగే కొండపైన ఉన్న శ్రీసీతారామలక్ష్మణ స్వామివార్లను దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన తోమడుపెద్దలను ప్రత్యేకంగా అలంకరించి కొండ వద్దకు తీసుకొచ్చి భజనలు చేశారు.



గంట్యాడ: అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

వాహన తనిఖీలు



ఆటోలో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని పాతబొబ్బిలి, దిబ్బలగుడివలస జంక్షన్‌లలో ఎస్ఈబీ అధికారులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఈబీ బొబ్బిలి సర్కిల్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పండగ నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలింపు జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎవరైనా అక్రమంగా ఎక్కువ మొత్తంలో మద్యం తరలించినా, అమ్మినట్లు తెలిసినా చర్యలు తీసుకుంటామని సిబ్బంది హెచ్చరించారు.

గోకవలసకు డాక్టరేట్



గోకవలస కృష్ణమూర్తి

రాజాం: రాజాంకు చెందిన రంగస్థల కళాకారుడు గోకవలస కృష్ణమూర్తికి ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 4న ఈ అవార్డును గోకవలసకు అందించనున్నట్లు వర్సిటీ మంగళవారం వెల్లడించింది. తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ అబిడ్స్‌లో అవార్డును ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. వివిధ సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో తాను చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇస్తున్నట్లు యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందిందని కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

‘సాధనా’ సభ్యుల ఔదార్యం



దాతలకు డోనర్ కార్డులు అందజేస్తున్న సాధనా యువజన సంఘం ప్రతినిధులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘ సభ్యులు రక్తం అత్యవసరమైన ఓ గర్భిణికి రక్తదానం చేసి, ఔదార్యం చాటుకున్నారు. భోగాపురం మండల కేంద్రానికి చెందిన కె.వి.శ్వేత అనే గర్భిణి ప్రసవం నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం చేరారు. ఆమెకు అరుదైన ఓ నెగటివ్ రక్తం ఎక్కించాల్సి వచ్చింది. శ్వేత బంధువులు సాధనా యువజన సంఘం ప్రతినిధులను సంప్రదించగా, నేవీలో పనిచేస్తున్న కంటుభుక్త నాగరాజు, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న మాషాడ సురేష్ రక్తదానానికి ముందుకువచ్చారు. పండగ నిమిత్తం సొంత గ్రామం జరజాపుపేటకు విచ్చేసిన వారిద్దరూ విజయనగరంలోని ఎస్.వి.ఎస్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి, రక్తదానం చేశారు. రక్తదాతలను గర్భిణి బంధువులు, సాధనా ప్రతినిధులు, స్థానిక పెద్దలు అభినందించారు.

ప్రభుత్వ నిర్ణయం మంచిదే..



ఫేస్ అథెంటికేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటున్న తహసీల్దారు గణపతిరావు

రామభద్రపురం: ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ నెల 17వ తేదీ నుంచి తమ కార్యాలయాలకు చేరుకున్న వెంటనే ఫేస్ అథెంటికేషన్ వేయాలన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదేనని మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు అంటున్నారు. గతంలో టీచర్లకే ఫేస్ అథెంటికేషన్ హాజరు నమోదు వర్తింపజేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులందరికీ అదే పద్ధతి వర్తించేలా ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ పి. గణపతిరావు, ఎంపీడీఓ కార్యాయంలో ఎంపీడీఓ రమామణి, సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఫేస్ అథెంటికేషన్ పద్ధతిలో హాజరు నమోదు చేసుకున్నారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



తెర్లాం: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు రాజేశ్వరరావు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు కోరారు. మండలంలోని అప్పలంపేట గ్రామంలో భూముల రీసర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గురవాన పార్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల క్రితం చేపట్టిన భూసర్వే కారణంగా ప్రస్తుతం గ్రామాల్లో భూముల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇప్పుడు భూముల రీసర్వే చేపట్టి, రైతుల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న భూ తగాదాలను పరిష్కరిస్తోందన్నారు. ఇప్పుడు ఈ భూముల రీసర్వే పూర్తయితే మరెన్నడూ భూ సమస్యలు రావన్నారు. గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేకు రైతులు, అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ, మండల సర్వేయర్ వెంకటరమణ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అవస్థలు



ట్రాఫిక్ జామ్ కారణంగా రామభద్రపురం మండల కేంద్రంలో నిలిచిన వాహనాల రాకపోకలు

రామభద్రపురం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పని ప్రదేశం నుంచి పల్లెలకు వచ్చిన వారంతా ఇప్పుడు పండుగ ముగియడంతో మళ్లీ పని ప్రదేశాలకు తిరుగు ప్రయాణమవుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో అటువైపుగా వెళ్తున్న వారంతా ట్రాఫిక్ అవస్థలు పడుతున్నారు. విశాఖపట్నం–రాయపూర్ జాతీయ రహదారి ఇదే అంతర్‌రాష్ట్ర కూడలి కూడా కావడంతో దీని మీదుగా విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం, శ్రీకాకుళం, ఒడిశా, రాయపూర్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించాలంటేనే నరకం చూడాల్సి వస్తోంది. పాదచారులు రోడ్డు దాటాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి. దుకాణాలకు సరుకులు కొనుగోలుకు వెళ్లే ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు, దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఎక్కువైపోతోందని అటువైపుగా వెళ్లేవారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం మిన్న.. సౌకర్యాలు సున్నా!

- పూడమ్మతల్లి వనుంగుడిలో కానరాని సదుపాయాలు
- భక్తుల నుంచి భారీగా కానుకలు వస్తున్నా పట్టించుకోని ఆలయ కమిటీ
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల: అక్కడి వనుంగుడికి ప్రతీ వారం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. గుడి అభివృద్ధికి బాగానే కానుకలు సమర్పిస్తారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కూడా భక్తుల నుంచి పెద్దమొత్తంలోనే నగదు వసూలు చేస్తారు. అయితే గుడి అభివృద్ధి మాత్రం కానరావడం లేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు ఆ గుడి పరిసరాలు దుర్గంధంతో నిండిపోవడం భక్తులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. ఇదీ నెల్లిమర్ల పట్టణంలోని శ్రీపూడమ్మతల్లి వనుంగుడి పరిస్థితి.


వివరాలిలా ఉన్నాయి..

నెల్లిమర్ల గ్రామదేవత శ్రీపూడమ్మతల్లి వనుంగుడి చాలా ప్రసిద్ధి. అమ్మవారంటే భక్తులకు అపారమైన నమ్మకం. స్థానిక రైల్వేట్రాక్‌ను ఆనుకుని, ఉన్న ఈ గుడికి ప్రతీ వారం వేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. ముఖ్యంగా మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు తమ కుటుంబ సభ్యులతో అమ్మవారి గుడికి వచ్చి, పండగ చేసుకుంటారు. ఆది, బుధవారాల్లో కూడా భక్తులు వస్తుంటారు. కేవలం పట్టణవాసులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు సైతం ఇక్కడి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వస్తుంటారు. ఇలా వచ్చిన వారంతా అమ్మవారికి కానుకలు సమర్పిస్తారు. ఇక్కడ పండగలు చేసుకునే భక్తులు అయితే ఆలయ కమిటీకి కొంత మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఈ ప్రాంగణంలో నిర్మించిన రేకుల షెడ్డులకు అద్దెగా వారి నుంచి మరి కొంత మొత్తం వసూలు చేస్తారు. వీటన్నిటితో పాటు భక్తులు కొట్టే కొబ్బరిబోండాం ముక్కలు తీసుకోవడానికి వేలం పాట నిర్వహించి, నగదు సేకరిస్తారు.

ఎమ్మెల్యే దృష్టికి విషయం..

ఆలయ కమిటీ కేవలం ఆదాయం మీద మాత్రమే దృష్టి సారిస్తోందని, గుడి అభివృద్ధిపైనా, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల పైనా శ్రద్ధపెట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కొందరు స్థానిక పెద్దలు కలిసి, గుడి పరిసరాల్లో సౌకర్యాల కల్పనకు చొరవ చూపించాలని కోరినట్లు తెలిసింది. ఇప్పటికైనా కమిటీ ప్రతినిధులు స్పందించి, గుడి ప్రాంగణంలో పరిశుభ్రత, అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారిస్తారోమో వేచి చూడాలి. అయితే ఇదే విషయంపై కమిటీ చైర్మన్ బైరెడ్డి నాగేశ్వరరావును వివరణ అడగ్గా ఆయన సమాధానం చెప్పేందుకు నిరాకరించడం కొసమెరుపు.

ఇంత మొత్తంలో ఆదాయం సమకూరుతున్నప్పటికీ గుడి అభివృద్ధి మాత్రం అంతంతమాత్రంగానే ఉందని భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వనుం గుడిలో కనీస సౌకర్యాలు కూడా కానరావడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఒక్క చేతిపంపు(బోరు) తప్ప తాగునీటి సౌకర్యం కూడా అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య లోపం కారణంగా గుడి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయని, ఎక్కడపడితే అక్కడే పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని, కోళ్లు, గొర్రెల వధ తర్వాత కనీసం శుభ్రపరిచే పరిస్థితి కూడా ఉండదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూడమ్మతల్లి వనుంగుడి



ఆలయ ప్రాంగణంలో పేరుకుపోయిన వ్యర్థాలు